ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.9 కనిష్ఠం 27.8

నిజామాబాద్
జిల్లా వార్తలు
3
గురువారం 20 జూన్ 2024



శ్రీచైతన్య పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈవో

ప్రైవేటు పాఠశాలలపై కొరడా

- పలు పాఠశాలలను తనిఖీ చేసి నోటీసులు ఇచ్చిన డీఈవో

నిజామాబాద్ అర్బన్, జూన్ 19: ప్రైవేటు పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్వీ దుర్గాప్రసాద్ కొరడా ఝుళిపించారు. బుధవారం నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసిన ఆయన నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలకు నోటీసులు ఇచ్చారు. 1 నుంచి 5వ తరగతి వరకు స్టేట్ సిలబస్ పుస్తకాలు ఎందుకు వాడటం లేదో అదే విధంగా ఫీజుకు సంబంధించిన వివరాలను ఎక్కడ కూడా నోటీస్ బోర్డులో పెట్టకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల పెంపునకు సంబంధించి ఎక్కడ కూడా గవర్నింగ్ బాడీ రిజర్వేషన్స్ పాస్ చేయకుండానే ఇష్టారీతిన ఎలా పెంచుతారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ అధికారులు సైతం అన్ని పాఠశాలలను తనిఖీ చేసి ఫీజుల వివరాలను తెలియజేయాలని, 1 నుంచి 5వ తరగతి వరకు స్టేట్ సిలబస్ పుస్తకాలనే వాడాలన్నారు. శ్రీచైతన్య, ఎస్ఆర్‌డీజీ పాఠశాలలను డీఈవో తనిఖీ చేశారు.

ముగిసిన పదోన్నతుల ప్రక్రియ

నిజామాబాద్ అర్బన్, జూన్ 19: విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల ప్రక్రియ బుధవారం ముగిసింది. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. జిల్లాలో సుమారు 402 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. ఎస్జీటీలు, పీఈటీలు, లాంగ్వేజ్ పండిత్-2లకు సంబంధించిన బదిలీల దరఖాస్తులను విద్యాశాఖ అధికారులు స్వీకరించనున్నారు. మిగిలిన పోస్టులకు రెండు కానీ అంతకంటే ఎక్కువ పదోన్నతి వచ్చిన ఉపాధ్యాయులు ఒకేచోట చేరే అవకాశం ఉంది. దీంతో వారి స్థానాల్లో తిరిగి పదోన్నతులను 15 రోజుల్లో ఇవ్వనున్నారు. ఎస్జీటీ, ఈక్వినాలెంట్ క్యాడర్‌కు సంబంధించి ఈనెల 20లోగా ఉపాధ్యాయులు దరఖాస్తులు సమర్పించాలని డీఈవో ఎన్వీ దుర్గాప్రసాద్ తెలియజేశారు. జూన్ 1, 2024 వరకు 8 ఏళ్ల సర్వీసు, ఇప్పుడు పనిచేస్తున్న పాఠశాలల్లో పూర్తయిన వారు, గతంలో దరఖాస్తు చేయనివారు తప్పనిసరిగా దరఖాస్తు చేయాలన్నారు. జూన్ 1, 2024 వరకు రెండేళ్లు పూర్తయి గతంలో దరఖాస్తు చేయకపోతే ఆసక్తి ఉంటే బదిలీ కోసం దరఖాస్తు చేయాలన్నారు. జూన్ 1, 2024 నుంచి మూడేళ్లలోపు సర్వీసు ఉన్నవారు గతంలో బదిలీ దరఖాస్తు చేసి ఉంటే బదిలీ మినహాయింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యం!



"జిల్లాలో ఇష్టారాజ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణ కొనసాగుతోంది. ప్రభుత్వ అనుమతులు, రిజిస్ట్రేషన్ లేకుండానే కొన్ని ఆసుపత్రులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సరిపడా సబ్బంది, వైద్యులు లేకుండానే సూపర్‌స్పెషాలిటీ పేరిట వైద్య సేవలందిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు.

- జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రుల నిర్వహణ
- సరిపడా సిబ్బంది, వైద్యులు లేకున్నా రోగులకు చికిత్స
- ప్రత్యేక సేవల పేరుతో రోగుల నుంచి భారీగా ఫీజుల వసూలు
- రిజిస్ట్రేషన్ లేకుండానే వైద్య సేవలందిస్తున్న మరికొన్ని ఆసుపత్రులు
- అధికారుల తనిఖీల్లో బయటపడ్డ ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణ తీరు
- పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపిన జిల్లా అధికారులు

నిజామాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అనుమతు, రిజిస్ట్రేషన్, గుర్తింపు పొందిన వైద్యులు లేకుండానే ఏళ్లతరబడి సూపర్‌స్పెషాలిటీ పేరిట సేవలను అందిస్తున్నారు. ఆసుపత్రుల నుంచి నర్సింగ్ హోంల వరకూ నిర్వహిస్తుండటంతో పాటు రోగులకు సేవలు అందిస్తున్నారు. వేల రూపాయల ఫీజులను వసూళ్లు చేస్తున్నారు. శిక్షణ పొందిన సిబ్బంది నుంచి స్పెషలిస్టు డాక్టర్లు లేకున్నా వైద్య సేవలను కొనసాగిస్తున్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులపై వచ్చిన ఫిర్యాదులతో అధికారులు తనిఖీ చేయగా ఆ ఆసుపత్రులను చూసి నివ్వెర పోయారు. అనుమతులు లేకుండానే కొన్ని ఆసుపత్రుల పరిధిలో ల్యాబ్‌లు, ఫార్మసీ స్టోర్‌లు నిర్వహిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో గతంలో పనిచేసిన అధికారులు కవర్లకు ఆశ పడటంతో తనిఖీలను కూడా పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా ఈ సేవలు కొనసాగుతున్నాయి.

జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాల వరకు

జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాల వరకు ప్రైవేటు ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. కొన్ని ఆసుపత్రులు మినహాయిస్తే మిగతా ఆసుపత్రులలో అన్ని వసతులను కల్పించడం లేదు. సర్జన్, స్పెషలిస్టు వైద్యులు లేకుండానే వైద్య సేవలను కొనసాగిస్తూ పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నారు. చాలా నర్సింగ్‌హోమ్‌లు, క్లీనిక్‌లో ఫార్మసిస్టులు లేకుండానే మందులను అమ్మకాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని పలు మార్లు రోగులు గతంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. కనీసం ఆసుపత్రుల తనిఖీలు చేయలేదు. నెలవారి మామూళ్లకు ఆశపడటం వల్ల పెద్దఎత్తున ఈ దందా కొనసాగింది. చివరకు చాలా మంది రోగుల ఫిర్యాదుతో కలెక్టర్ తనిఖీలకు ఆదేశించారు. చాలా డయాగ్నిటిక్స్ సెంటర్‌లలో కూడా నిబంధనలు ఉల్లంఘించినట్లు తనిఖీ అధికారులు గుర్తించారు. పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

జిల్లాలో 529 ఆసుపత్రులు

జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం మొత్తం 529 ఆసుపత్రులు డయాగ్నిటిక్స్ సెంటర్లు, క్లీనిక్స్, నర్సింగ్‌హోం, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, ఫిజియోథెరపి ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో డెంటల్ 75, డయాగ్నిటిక్స్ 84, క్లీనిక్స్, నర్సింగ్‌హోమ్స్ 345, ఫిజియోథెరఫి 25 వరకు ఉన్నాయి. ఆసుపత్రి నిర్వహించేందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. మొత్తం 529లో కేవలం 394 వాటికే అనుమతులను తీసుకున్నారు. 122 అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారు. ఈ ఆసుపత్రుల్లో రిజిస్ట్రేషన్ సమయంలో 279 ఆసుపత్రుల వారే వైద్యులు, సిబ్బంది సర్టిఫికెట్లను అందించారు. జిల్లాలో 17 ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ అయిపోయినా ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఉన్న ఈ ఆసుపత్రులు, డయాగ్నిటిక్స్ సెంటర్లు, ఫిజియోథెరపికి సంబంధించిన వాటిలో కేవలం 127 ఆసుపత్రుల్లోనే అన్ని సౌకర్యాలు ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. మొత్తంగా వాటి వివరాలను ఆసుపత్రుల వారిగా నివేదికలను పొందుపర్చారు.

కొనసాగుతున్న గొలుసు దందా..

జిల్లాలోని ప్రతి నర్సింగ్ హోంలో కొంత మందిని నెట్‌వర్క్‌గా పెట్టుకొని గొలు సు దందాను కొనసాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధు లు ఇతర సమస్యలు ఉన్న వారిని గుర్తించి తమ ఆసుపత్రులకు వచ్చే విధంగా చూసుకుంటున్నారు. గ్రామీణ వైద్యులతో పాటు ఇతర సిబ్బందిని తమ అవసరాలకు వినియోగించుకుంటూ వారికి కమీషన్ రూపంలో 20 నుంచి 30 శాతం వరకు ముట్టచెపుతున్నారు. ఈ కమీషన్‌కు ఆశపడిన కొందరు తెలిసిన ఆసుపత్రులకు పంపిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తెల్లకార్డు ఉన్న వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగానే అన్ని శస్త్రచికిత్సలు చేస్తున్నా.. గొలుసు దందా వల్ల ఎక్కువ మంది ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తున్నారు.

పైరవీలు చేస్తున్న ఆసుపత్రుల నిర్వాహకులు

జిల్లా ఉన్నతాధికారులు ఆసుపత్రులపై దృష్టి పెట్టడంతో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు అధికార పార్టీ నేతలను ఆశ్రయిస్తున్నారు. పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకుండా ఉండేందుకు పైరవీలను మొదలు పెడుతున్నారు. మరికొంత మంది వైద్యులు తమ సంఘం ద్వారా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. జిల్లాలో మొదటి సారిగా అన్ని ఆసుపత్రుల్లో తనిఖీ చేయడంతో పాటు పూర్తిస్థాయిలో నివేదిక రూపొందించడంతో పలు విషయాలు బయటపడటం వల్ల చర్యలు చేపట్టే అవకాశం ఉండటంతో ముందస్తుగా ఈ ప్రయత్నాలను చేస్తున్నారు. కొన్ని ఆసుపత్రులు, క్లీనిక్‌లు ప్రభుత్వ వైద్యులకు సంబంధించినవి ఉండటంతో వారు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయి నివేదిక చేయడం రాష్ట్ర స్థాయి అధికారులకు కూడా పంపించడం వల్ల కొన్ని ఆసుపత్రులపై తప్పనిసరిగా చర్య ఉంటుందని భావిస్తున్నారు. వీటితో పాటు నిబంధనలు పాటించని ల్యాబ్‌లు, ఇతర కేంద్రాలపై కూడా చర్యలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నివేదిక ఆధారంగా నోటీసులు

ఈ నివేదిక ఆధారంగా నిబంధనలను పాటించని ఆసుపత్రులు, డయాగ్నిటిక్ సెంటర్లు, ఫిజియోథెరపి సెంటర్లకు నోటీసులను ఇచ్చేందుకు అధికారులను సిద్ధమవుతున్నారు. పూర్తిస్థాయిలో వసతులు కల్పించడంతో పాటు నిబంధనల మేరకు ఫీజుల బోర్డులతో పాటు సిబ్బందిని ఉండే విధంగా చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ఏ ఆసుపత్రుల్లో ఏ వైద్యులు ఉంటారో ఆ సేవలే అందించాలని లేని వైద్య సేవలు ఎలా అందిస్తారని నోటీసులో వివరణ కోరేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఆసుపత్రులపై పూర్తిస్థాయి నివేదికను రూపొందించామని ఉన్నతాధికారులకు అందించామని ఇంచార్జి వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా నోటీసులను జారీ చేస్తామని తెలిపారు. వారు ఇచ్చే సమాధానాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రైతు వేదికలు వెలవెల!



మెండోర రైతువేదిక భవనం


- జిల్లాలో నిరుపయోగంగా రైతువేదికలు
- మందుబాబులకు అడ్డాలు.. కన్నెత్తి చూడని అధికారులు
- నిధులు లేక కొరవడిన వేదికల నిర్వహణ
- నూతన ప్రభుత్వం దృష్టి సారించాలని రైతుల వేడుకోలు

మెండోర, జూన్ 19: రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలు వెలవెలబోతున్నాయి. రైతులతో సమావేశాలను ఏర్పాటు చేస్తూ వారికి పంటల సాగు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.30లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. రైతు వేదికల నుంచే మండల స్థాయి అధికారులు (ఏఈవో)లు నిత్యం విధులు నిర్వహించాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ జిల్లాలో ఏ ఒక్క చోట ఇలాంటి పరిస్థితి కనిపించడమే లేదు. అధికారులు నెలల తరబడి అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇదే అదునుగా కొందరు మందుబాబులు అడ్డాలుగా మార్చుకొని మద్యం తాగుతూ వీరంగం సృష్టిస్తున్నారు. దీంతో రైతు వేదికల పరిసరాలు మద్యం సీసాలతో దర్శనమిస్తున్నాయి. అయితే చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రక్షణ లేకుండానే పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వమైనా రైతు వేదికలను వినియోగించాలని రైతులు కోరుతున్నారు.

నిర్వహణ లేక నిరుపయోగం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రైతు వేదికల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. విత్తనాలు సాగుచేసే దగ్గరినుంచి పంటను అమ్ముకునేవరకు రైతువేదికలలో భూసార పరీక్షలు, విత్తనాల ఎంపిక, ఎరువుల వాడకం విధానంతో పాటు ఆయా పంటల సాగుపై మెలకువలు రైతులు తెలుసుకునేందుకు వీటిని ఏర్పాటు చేశారు. అయితే రైతు వేదికల నిర్వాహణకు నిధులు కేటాయించక పోవడంతో వేదికలు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. రైతులకు ఉపయోగంలోకి రాకుండానే శిథిలావస్థకు చేరుకొని పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాగు పద్ధతులు అధిక దిగుబడి వచ్చే అంశాలపైన చర్చ సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా శాస్త్రవేత్తల ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు వయవసాయ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు అనుకూలంగా రైతు వేదిక భవనాలు నిర్మాణం చేశారు. గత ప్రభుత్వం కొన్నాళ్ల పాటు ప్రతీ రైతు వేదిక నిర్వహణ కోసం నెలకు రూ.9 వేలు మంజూరు చేసింది. తాగునీరు, స్టేషనరీ, జిరాక్స్ పేపర్లు, విద్యుత్ బిల్లులు, పారిశుధ్యం నిర్వహణ, భవన మరమ్మతులకు ఖర్చు చేసేవారు. అయితే గత ఏడాది నుంచి రైతు వేదికలకు నిర్వహణకు నిధులు రావడంలేదు. ఏడాది గా నిధులు నిలిచిపోవడంతో స్థానికంగా ఉండే వ్య వసాయ అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో సొంత నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని కొందరు వ్యవసాయ విస్తారణ అధికారులు వాపోతున్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా రైతు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వేదికల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రైతు వేదికలతోనే సమస్యల పరిష్కారం..
: ఏలేటి శ్రీనివాస్, రైతు, బుస్సాపూర్



గ్రామాల్లో ఉన్న రైతు వేదికల్లో అధికారులు సూచనలు సలహాలు ఇస్తేనే రైతులు పండించిన పంటలకు వచ్చే సమస్యలు పరిష్కారం అవుతాయి. అటువంటి రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి. రైతులను దృష్టిలో పెట్టుకొని వృథాగా ఉన్న రైతు వేదికలను వినియోగంలోకి తేవాలి.

నిధులు లేక నిర్వహణ కొరవడింది..
: రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి



ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణకు నిధులు విడుదల చేయాలి. వేదికల్లో అనేక సమస్యలు ఉన్నాయి. కొన్ని చోట్ల కరెంట్ సౌకర్యం కూడా లేదు. జిల్లా వ్యవసాయధికారి రైతు వేదికల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయి.

కేసీఆర్ రాష్ట్రాన్ని లూటీ చేశారు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- ఘనంగా రాహుల్ గాంధీ జన్మదినం

నిజామాబాద్ అర్బన్, జూన్ 19: ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు కొనుగోళ్ల విషయంలో అక్రమాలు జరిగాయని సుమారు 2వేల కోట్ల వరకు ప్రజల సొమ్మును దోచుకున్నారని కేసీఆర్ రాష్ట్రాన్ని లూటీ చేసి ఇప్పుడు అబద్ధాలు ఆడుతున్నాడని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. బుధవారం అర్బన్ కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయాన్ని సీనియర్ నాయకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌తో కలిసి షబ్బీర్ అలీ ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సొమ్మును లూటీ చేసిన వారి నుంచి రికవరీ చేయవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దొంగల వలే లూటీ చేశారని ఆయన అన్నారు. విచారణ కమిషన్‌కు మాజీ సీఎం కేసీఆర్ తప్పక హాజరుకావాలని కుంటి సాకులు చెప్పడం సరికాదన్నారు. ప్రజలు తమ సమస్యలను తన కార్యాలయంలో చెప్పవచ్చని ఆరోగ్యశ్రీ, ఎల్‌వోసీల గురించి హైదరాబాద్ వెళ్లవల్సిన అవసరం లేకుండా ఇక్కడినుంచే వారికి సేవలు అందించేందుకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని బాపూజీ వచనాలయ నూతన భవన నిర్మాణం కోసం హెచ్‌డీఎఫ్ నిధుల నుంచి 25లక్షలు ఇచ్చేందుకు షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు.



రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీకి ఎల్లప్పుడు ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన ఉంటుందని ఆయన అన్నారు.

అధికారులతో ప్రభుత్వ సలహాదారు భేటీ



షబ్బీర్ అలీకి పూలమొక్కను అందజేస్తున్న కలెక్టర్, తదితరులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 19: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బుధవారం జిల్లా అధికారులతో భేటీ అయ్యారు. కలెక్టరేట్‌లో జరిగిన భేటీ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రధానంగా జిల్లాలోని ఆయా మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ తీరుతెన్నులను గురించి అడిగి తెలుసుకున్నారు. అమృత్ పథకం కింద చేపట్టాల్సి ఉన్న మంచినీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సంబంధించి కొంత ప్రతిష్టంభన నెలకొందని ప్రజారోగ్య శాఖ ఈఈ తిరుపతి ఆయన దృష్టికి తేగా తక్షణమే ఆయన స్పందించి అప్పటికప్పుడే ఫోన్‌లో సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానాకిశోర్‌ను సంప్రదించి ప్రతిష్టంభన తొలగిపోయేలా చొరవ చూపారు. పలు అంశాలపై కూడా చర్చించిన ఆయన అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ తదితరులు మొక్కను బహూకరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా, షబ్బీర్ అలీని రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ సమస్యలు, ధరణి సమస్యలను ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ స్పందిస్తూ.. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు భూపతిప్రభు, తహసీల్దార్లు శ్రీనివాస్‌రావు, బాల్‌రాజు, నాగార్జున, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'బస్‌పాసుల కోసం కాలేజీలు, పాఠశాలలు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు పొందాలి'

సుభాష్‌నగర్, జూన్ 19: విద్యార్థులు ఆర్టీసీ బస్‌పాస్‌ల కోసం కాలేజీ, పాఠశాలల యాజమాన్యాలు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు పొందాలని నిజామాబాద్ ఆర్టీసీ ప్రాంతీయ అధికారి జానిరెడ్డి తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కళాశాలలు, పాఠశాలలు తెరుచుకున్న సందర్భంగా బస్‌పాస్‌ల కోసం రీజియన్‌లోని ఆరు డిపోలలో అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. బస్‌పాస్‌లు తీసుకునే విద్యార్థులు వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొబైల్ నెంబర్‌ను తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న అనంతరం బస్ పాస్ ఫారంను పాఠశాల, కళాశాల యాజమాన్యాలు అప్రువల్ చేయాలన్నారు. అప్రువల్ చేసిన అనంతరం విద్యార్థి యొక్క మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ రూపంలో మెస్సేజ్ వస్తుందన్నారు. ఆ మెస్సేజ్‌ను స్థానిక బస్టాండ్‌లో ఉన్న బస్‌పాస్ కౌంటర్‌లో చూపించి బస్‌పాస్ పొందాలన్నారు. విద్యార్థినులు తప్పనిసరిగా ఆధార్ కార్డును కండక్టర్‌కు చూపించి ఉచిత ప్రయాణం చేయాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

షబ్బీర్ అలీ ఏ హోదాలో అధికారులతో రివ్యూ పెట్టారు

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, జూన్ 19: మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఏ హోదాలో కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ అధికారులతో రివ్యూ పెట్టారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి ప్రజలు చీకొట్టి తరిమేస్తే నిజామాబాద్‌కు వచ్చి అధికార అహంతో విర్రవీగుతున్న షబ్బీర్‌అలీకి అర్బన్ ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని ధ్వజమెత్తారు. ఏ హోదాలో అధికారులతో సమావేశం నిర్వహించారని ఆయన ప్రశ్నించారు. కామారెడ్డిలో చెల్లని రూపాయి ఇక్కడ ఎలా చెల్లుతుందనుకున్నారు అందుకు ఇందూరు ప్రజలు నీకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అర్బన్ మీద ప్రేమ ఉంటే ఇక్కడ అనేక సమస్యలు ఉన్నాయని పదేళ్లలో ఒక్కరికి కూడా రేషన్ కార్డులు, పెన్షన్ సరిగా వస్తలేదన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని దానిపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి కావాల్సిన నిధులను మంజూరు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలన పెట్టి సమస్యలపై దరఖాస్తులను తీసుకున్నారని ఇప్పటి వరకు ఒక్క పని కూడా చేయలేదన్నారు. అర్బన్ ప్రజలు షబ్బీర్‌కు తగిన గుణపాఠం చెప్పినప్రజలు దొడ్డిదారి అధికారం చెలాయిస్తే ఊరుకునేది లేదన్నారు. జిల్లాలో అనేక సమస్యలు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో పనితీరుపై, డబుల్ బెడ్‌రూం ఇండ్లు వృథాగా ఉన్నాయని, మున్సిపల్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థపై ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, న్యాలంరాజు, ప్రభాకర్, సాయివర్ధన్, మాస్టర్ శంకర్, వెల్డింగ్ నారాయణ, పల్నాటి కార్తిక్, తదితరులు పాల్గొన్నారు

క్రీడా అకాడమీలో ఎంపికలకు ఆహ్వానం

సుభాష్‌నగర్, జూన్ 19: తెలంగాణ క్రీడా అకాడమీలో ఈనెల 24, 25 తేదీల్లో ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ముత్తెన్న తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 16-18 సంవత్సరాలలోపు ఉన్న బాలురు, బాలికలు అర్హులని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రవేశాల కోసం క్రీడాకారుల యొక్క శారీరక క్రీడానైపుణ్యాన్ని పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. సైక్లింగ్, రెజ్లింగ్ కోసం వెలోడ్రోమ్ అకాడమిలో సంప్రదించాలని అన్నారు. హాకీ అకాడమి కోసం వనపర్తి, అథ్లెటిక్స్ అకాడమి కోసం ఖమ్మం, వాలీబాల్ అకాడమి కోసం సరూర్ నగర్, రాజన్నసిరిసిల్లలో గల అకాడమిలో హాజరుకావాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వయస్సు, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, 10 పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

కారు బైక్ ఢీ : ఒకరి మృతి

బోధన్‌రూరల్, జూన్ 19: ఎడపల్లి మండల కేంద్రంలోని బ్రిడ్జి సమీపంలో బుధవారం రాత్రి కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన కలేద్(30)అని ఎడపల్లి ఎస్సై తెలిపారు. కారును అదుపులోకి తీసుకున్నామని ఘటనపై పూర్తి విచారణ చేపడుతున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. పూర్తి వివరాలు గురువారం వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

ఆపదలో ఆదుకునే వారే ప్రజాసేవకులు

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్, జూన్ 19: ఆపదలో ఉన్నవారిని ఆదుకుని అక్కున చేర్చుకోవడమే నిజమైన ప్రజాసేవ అని ఈ సేవా కార్యక్రమాల్లో ఇందూరు యువత ముందువరుసలో ఉండటం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి అన్నారు. బుధవారం రూరల్ మండలం ధర్మారం(ఎం) గ్రామంలో ఇందూరు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైస్ బ్యాగ్ చాలెంజ్' కార్యక్రమానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కరోనా విపత్కర సమయంలో పేదలకు భోజనం అందజేయడంతో పాటు కరోనాతో మృతిచెందిన అనాథ శవాలకు వారి మతాచారం ప్రకారం కర్మకాండలు నిర్వహించడం అందరి వల్ల కాదని, ఎంతో మనోధైర్యం ఉంటే తప్ప ఇలాంటి కార్యక్రమాలు సాధ్యం కావన్నారు. రూరల్ మండలంలోని ధర్మారం (ఎం), మల్లారం, కొత్తపేట, మల్కాపూర్ తండా, గాంధీనగర్, ముత్తకుంట, లింగితండాల ప్రజలు తమకు తోచినంత బియ్యం విరాళం ఇచ్చారని సంస్థ నిర్వాహకులు సాయిబాబు తెలిపారు. 25 కిలోల చొప్పున 100 మంది రైతులు అన్నదానం కార్యక్రమంలో పాల్గొనడం గొప్పవిషయం అన్నారు. సేకరించిన ఈ బియ్యం ప్రతిరోజు పేదలకు అన్నదానం చేసేందుకు ఉపయోగిస్తామని సాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ముప్ప గంగారెడ్డి, కెతావత్ యాదగిరి, కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బొల్లం రాజన్న, కొర్వ గంగాదర్, మోహన్, లింగం, పూర్ణచందర్ రాజు, ఆదేప్రవీణ్ ఇందూరు యువత సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఎప్పటికీ సురక్షితం కాదని అవి ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. బుధవారం ధర్మారం (ఎం) గ్రామంలో రాహుల్ గాంధీ జన్మదినం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ముప్ప గంగారెడ్డి, కెతావత్ యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, కొర్వ గంగాదర్, మోహన్ పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాతపరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

నిజామాబాద్ అర్బన్, జూన్ 19: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూన్ 24 నుంచి 29 వరకు జరుగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. పరీక్ష ప్రారంభమయ్యే మూడురోజుల ముందు నుంచి కమిషన్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన అభ్యర్థులకు సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30లకు వరకు, మధ్యాహ్నం 2.30ల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్స్‌లలో పరీక్షలు కొనసాగుతాయని పరీక్ష రాసే అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనల గురించి అభ్యర్థులకు పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలి ముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉదయం 8.30ల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, 9.30లకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేయడం జరుగుతుందని, అదే విధంగా మధ్యాహ్నం జరిగే పరీక్షకు కూడా గంట ముందే అనుమతిస్తామని గేట్లు మూసివేసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమన్నారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, బుక్కులు, హ్యాండ్‌బ్యాగ్‌లు, పౌచ్‌లు, ఇతర ఎలాంటి వాటిని తీసుకురావద్దన్నారు. షూస్ వేసుకోవద్దని చెప్పులు ధరించాలని బయోమెట్రిక్‌కు ఆటంకం కలిగించేలా మెహెందీ, ట్యాటూలు ఏవైనా ఉంటే అనుమతించమన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ముందుగానే చూసుకొని వస్తే పరీక్ష రోజు ఇబ్బంది ఉండదని ఆయన తెలిపారు.

అవినీతికి తావు లేకుండా నియోజకవర్గ అభివృద్ధి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ● అంకాపూర్, పెర్కిట్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

ఆర్మూర్‌రూరల్, జూన్19: ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం అంకాపూర్, పెర్కిట్, ఆర్మూర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్‌రూంలను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పరిశీలించారు. డబుల్‌బెడ్‌రూంల నిర్మాణాలు చివరిదశలో ఉన్నాయని, రాజకీయాలకు అతీతంగా నిజమైన అర్హులకు ఇళ్లను కేటాయించాలని అధికారులకు సూచించామన్నారు. గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శకంగా ఇళ్లు కేటాయించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆర్మూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంత అభివృద్ధికి నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు నలుగురు మంత్రులను కలిసి చర్చించామన్నారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, మంత్రులు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆర్మూర్‌లో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ ఏర్పాటుకు రూ.150కోట్లు మంజూరు ఇవ్వాలని సీఎంను కోరామన్నారు. ఇందుకు 25ఎకరాల స్థల పరిశీలన చేయనున్నామన్నారు. అదే విధంగా ఆర్మూర్ నియోజకవర్గానికి పదివేల ఇళ్లు మంజూరు చేయా లని విన్నవించామని, స్థలాలు ఉన్న వారికి 3500 ఇళ్లు కావాలని కోరినట్లు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తెలిపారు. రైల్వేశాఖ మంత్రిని కలిసి ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లి రైల్వేలైన్ వేయాలని కోరామని, సర్వే జరపడానికి అధికారులను పంపిస్తామని తెలిపారన్నారు. జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రికి, అధికారులకు విన్నవించామన్నారు. వాయు, రైల్వే, బస్సు రవాణాకు ప్రాధాన్యత ఇవ్వాలని తాను కోరినట్లు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గజానన్, బీజేపీ నాయకులు కంచెట్టి గంగాధర్, కలిగోట గంగాధర్, జగిర్దార్ శ్రీనివాస్, ఆకుల రాజు, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, ఎంపీటీసీ రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

'అధిష్ఠానం నిర్ణయానికి లోబడి ఉండాలి'

బాన్సువాడటౌన్ , జూన్ 19 : కాంగ్రెస్ నాయకులు పార్టీ పరువును అప్రతిష్ట పాల్జేయొద్దని, అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలకు లోబడి ఉండాలని బాన్సువాడ మాజీ ఎంపీటీసీ దేవికృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం , రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాడవం సంతోషంగా ఉందన్నారు. 45 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నాడనే వార్తలపై కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు అడ్డుకుంటామనడం హస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకునే అంశం అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే , బాన్సువాడ కాంగ్రెస్ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ఇప్పటి వరకు పోచారంను కాంగ్రెస్‌లోకి రానివ్వమని ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని కార్యకర్తలు గమనించాలని కోరారు.

నిబంధనల మేరకు హోటళ్లు, రెస్టారెంట్‌లు నడపాలి : సీపీ

ఖిల్లా, జూన్ 19: పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోటల్స్, రెస్టారెంట్‌లు, గేమింగ్ జోన్‌లు, అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు, ఎస్టాబ్లిష్‌మెంట్ నిర్వహించే వారు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. కొన్నిచోట్ల సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రతకు కావాల్సిన నియమనిబంధనలు పాటించకుండా ఎటువంటి హోటల్స్, రెస్టారెంట్‌లు నడిపించరాదని హెచ్చరించారు. ఎవరైనా సంబంధిత శాఖల నుంచి భద్రతకు సంబంధించి అనుమతి తీసుకోని పరిస్థితుల్లో పోలీస్ శాఖ, సంబంధిత శాఖలతో అటువంటి వాటిపై దాడులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖ ఆదేశాలను పాటిస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా ఎటువంటి వ్యాపారాలు నిర్వహించరాదని తెలిపారు.

తొర్లికొండ పాఠశాలలో 30మంది విద్యార్థుల చేరిక

జక్రాన్‌పల్లి, జూన్ 19: మండలంలోని తొర్లికొండ పాఠశాలలో గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల బుధవారం పలువురు విద్యార్థులు చేర్పించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్ తెలిపారు. ఈ పాఠశాలలో సుమారు 30మంది విద్యార్థులు చేరినట్టు ఆయన తెలిపారు. విద్యార్థులకు రికార్డు షీట్‌ను ఎంఈవో శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ బాలుర వసతిగృహం వార్డెన్ చిట్యాల సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూర్ వాసి బెహరాన్‌లో మృతి

మోపాల్, జూన్ 19: మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన చెన్నూ రు బాల్‌రాజ్ (45) కరెంట్ షాక్‌తో బెహరాన్‌లో మృతిచెందిన సంఘటన గ్రామంలో తెలియడంతో విషాదఛాయలు నెలకొన్నాయి. బతుకుదెరువు కోసం భార్య, పిల్లలను వదిలి బెహరాన్‌కు వెళ్లిన బాల్‌రాజ్ కరెంట్ షాక్‌తో ఈనెల 15వ తేదీన మృతిచెందాడు. విషయం కుటుంబ సభ్యులకు బుధవారం సమాచారం అందింది. సమాచారం. 20 సంవత్సరాల క్రితం బెహరాన్‌కు వెళ్లి వస్తూ పోతున్నాడని గ్రామస్తులు తెలిపారు. అక్కడ బాల్‌రాజ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగలడంతో మృతి చెందడంతో అక్కడ ఉన్న స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అం దించారు. మృతదేహం కోసం కుటుంబ సభ్యులు, వారి బంధువులు, గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ధరణి సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

బోధన్‌రూరల్,జూన్19: ధరణి సమస్యలపై మండలంలోని అన్ని గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతున్నామని బోధన్ తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. మూడు బృందాలుగా బోధన్ మండలంలోని అన్ని గ్రామాలో పర్యటించి గ్రామాలలో ప్రజల వద్ద ధరణిలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటన జరిపి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.

పంటల సాగు వివరాలు నమోదు చేయాలి : జిల్లా వ్యవసాయాధికారి

డిచ్‌పల్లి,జూన్ 19: వానకాలం పంటల సాగులో రైతులు ఏ సర్వే నంబర్‌లో ఏ పంటలు సాగు చేస్తున్నారో సమగ్రమైన వివరాలను వ్యవసాయాధికారులు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆయన డిచ్‌పల్లి మండలంలోని ముల్లంగి గ్రామ శివారులో క్రాప్ బుకింగ్ వెరిఫికేషన్ లో భాగంగా పర్యటించారు. రైతులకు వానకాలం పంటల సాగులో ఎటువంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ విస్తీర్ణాధికారులు నివృత్తి చేయాలని రైతుల పంటల సాగు వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఫర్టిలైజర్ దుకాణాలలో విక్రయాలపై నిఘా ఉంచాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి వెంట మండల వ్యవసాయాధికారి రాంబాబు, ఏఈవో భావన, రూపేశ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

రుద్రూరు, జూన్ 19: రుద్రూరు మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, మండల నాయకులు నడిపింటి నగేష్, ఎంపీటీసీ గౌస్, వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్:ముప్కాల్, బాల్కొండ మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి రోగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్నారెడ్డి, ముస్కు మోహన్, కొమ్ముల శ్రీనివాస్, ఏలేటి విజయ్, మల్లారెడ్డి, జైడి రవి, జక్క రాజేశ్వర్, మల్లారెడ్డి, ముత్తెన్న, బద్దం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పలకలు పెన్సిల్లు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెండోర టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు సుంకెట రవి కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ పథకాల అమలు వివరాలను ప్రజలకు చేరవేస్తు గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, తక్కూరి దేవేందర్, పాలెపు నర్సయ్య, బుచ్చిమల్లయ్య, ప్రసాద్, గంగారెడ్డి, శ్రీనివాస్, ప్రదీప్, శ్రీరాముల మురళి, దూలూర్ కిషన్ గౌడ్, శేఖర్, అజాహరోద్దీన్ , నల్ల సాయికుమార్,

నవీపేట: ఏబీసీ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం స్టేషన్ ఏరియాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రాహుల్‌గాంధీ నాయకత్వంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత ముందుకు వెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, వెంకట్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మోతిలాల్, సాయేందర్, రాజేందర్, చింతల కిషన్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లిలో రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాట్‌పల్లి నర్సారెడ్డి, జైడి మల్లేష్, సురేష్, రాజు, లక్ష్మణ్, అక్బర్‌ఖాన్, సుదీర్, ప్రశాంత్, ప్రేమ్‌కుమార్, జనార్ధన్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లపంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండబోదని రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రి కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారి, నాయకులు దాము, శరత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు ఎల్లం, గౌసోద్దీన్, నాయకులు డబ్బు, ఆదినారాయణ, నవీన్, విష్ణువర్ధన్, బడు, ఇనాయత్ అలీ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. సాలూర గ్రామంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండల కేంద్రంలో కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు మందర్నా రవి మాట్లాడుతూ భావి భారత భవిష్యత్ ఆశ కిరణం రాహుల్ గాంధీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, సాలూర కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, శ్రీనివాస్ రెడ్డి, సాయిలు, మాజీ ఎంపీటీసీ శంకర్, అనిల్, రాహుల్, లక్ష్మణ్, దేవదానం, ఖాజాపూర్ అశోక్, సాలూర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- కోటగిరి వారంతపు సంతకు వెళ్తుండగా ఘటన
- కొత్తపల్లిలో విషాద ఛాయలు

కోటగిరి, జూన్ 19: వారసంతకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యభర్తలను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించిన ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరిగింది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పుప్పాల సాయిలు (56), పుప్పాల పోశవ్వ (50)అనే దంపతులు బుధవారం కోటగిరి మండల కేంద్రంలో నిర్వహించిన వార సంతకు తమ ఎక్సెల్ వాహనంపై బయల్దేరారు. అయితే ఎక్లాస్‌పూర్ క్యాంప్ వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి రామాలయం ప్రహరీ అరుగుకు బలంగా ఢీ కొట్టింది. దీంతో భార్య పోశవ్వ వాహనంపై నుంచి ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందింది. సాయిలుకు సైతం తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కోటగిరి ఎస్సై సందీప్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సైసందీప్ తెలిపారు. కాగా, రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందడంతో కొత్తపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.



మృతులు భార్యభర్తలు (ఫైల్)

సాయిలు, పోశవ్వలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం కాగా వారికి పెళ్లిళ్లు చేశారు. ఇంటి పట్టునే ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్న వీరు సంతకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదంగా మారింది.

బ్యాంక్ లింకేజీలో అవార్డు రావడం అభినందనీయం

- డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్

డిచ్‌పల్లి,జూన్ 19: బ్యాంకు లింకేజీ కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసుకున్నందుకు నిజామాబాద్ జిల్లాకు, రాష్ట్ర స్థాయిలో అవార్డు మరియు డిచ్‌పల్లి మండల సమాఖ్యకు కూడా అవార్డు రావడం అభినందనీయమని జిల్లా డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ సాయాగౌడ్ అన్నారు. బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని టీటీడీసీ కార్యాలయంలో జరిగిన జిల్లా మహిళ సహకార సమాఖ్య 81వ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీడీ సాయాగౌడ్ మాట్లా డుతూ... జిల్లాకు రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం గొప్పవిషయమని, బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి సహకరిం చిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. తక్కువ సమయంలో జిల్లాలో 70శాతం ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాంలు కుట్టి అందజేయడం జరిగిందన్నారు. డిచ్‌పల్లి మండల మహిళ సమాఖ్యకు రాష్ట్రస్థాయిలో అవార్డు పొందడం అభినందనీయమని అడిషనల్ డీఆర్‌డీఏ రవీందర్ అన్నారు. రానున్న రోజుల్లో మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికి క్యాంటీల నిర్వహణ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, సోలర్ విద్యుత్ ప్లాంటు, వంటి వివిధ కార్యక్రమాలను మహిళలకు అప్పగిస్తారని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా మొదటి స్థాయిలో రావడంతో అధికారులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పీడీ సాయాగౌడ్‌ను ఘనంగా సన్మానించారు.


పీడీ సాయాగౌడ్‌ను సన్మానిస్తున్న అధికారులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు

కార్యక్రమంలో డీపీఎం శ్రీని వాస్, డీపీఎం ఫైనాన్స్ సంధ్యరాణి, డీపీఎం బ్యాంకులింకేజీ నీలిమా, డీపీఎం నాన్‌షామ్ సాయిలు డీపీఎం ఫామ్ మారుతి,ఏపీఎం సరోజిని, వరలక్ష్మీ, మండలాల సమాఖ్య ప్రతినిధులు, ఏపీఎంలు, సీబీవో ఆడిటర్లు, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు రాధ, కోశాధికారి లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

'హరిపూర్‌ను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి'

ఆర్మూర్‌రూరల్, జూన్19:ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామపంచాయతీలో ఉన్న హరిపూర్‌ను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం మహిళలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళ అధ్యక్షురాలు స్వాతిచిత్రలేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసిందని, చేపూర్ గ్రామంలో ఉన్న తమ హరిపూర్ (చేపూర్ కాలనీ)ని విస్మరించారన్నారు. నూతన గ్రామపంచాయతీ ఏర్పడుతుందని, తాము సంబరాలు చేసుకున్నామని, కాని ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు చేయలేదని వారు వాపోయారు. గ్రామ పంచాయతీకి కావల్సిన అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని ఇంత వరకు ప్రత్యేక గ్రామపంచాయతీగా ప్రకటించకపోవడం బాధకరమన్నారు. హరిపూర్‌లో 750మంది ఓటర్లు ఉన్నప్పటికీ గ్రామపంచాయతీగా నోచుకోకపోవడం విడ్డూరమన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్ రెడ్డిలు చొరవ చూపి తమ గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని, వచ్చే సర్పంచ్ ఎన్నికలకు ముందే అధికారికంగా ప్రకటించి గేజిట్ ఇప్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రవి, కార్యదర్శి పోశగౌడ్, కోశాధికారి నవీన్, సత్తెయ్య, ఎల్లయ్య, గంగాధర్, రాజాగౌడ్, పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన ర్యాలీలు

రుద్రూరు, జూన్ 19 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహిం చడం జరుగుతుందని అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 1-19 సంవత్సరాల లోపు విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ అయేషా సిద్దిఖా తెలిపారు.


రుద్రూరులో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏర్గట్ల: ఏర్గట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నూలి పురుగుల నిర్మూలన అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యసూపర్‌వైజర్ ఆకుల మారుతి, ఆశా వర్కర్‌లు పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలో బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నేషనల్ పులి పురుగుల నివారణ దినోత్సవం ర్యాలీని నిర్వహించారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవో మారుతీ, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, సూపర్‌వైజర్ జ్యోతి, సాయి కుమారి, ఏఎన్‌ఎంలు రోజా, శ్రీదేవి, ఏపీవో గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : మండల వైద్యాధికారి డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ జాతీయ నులి పురుగు నివారణ జాతీయ దినోత్సవం సందర్భంగా పిల్లలకు మాత్రలను వేయించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో వైద్యాసిబ్బంది తబిత,మేరీ,సాయికిరణ్,రమేష్,అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది జక్కుల మోహన్, శ్యామల, సుభద్ర, నవ్య, అరుణ, రమా, శిరీష, మమత, పాల్గొన్నారు.

పెద్దబజార్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బుధవారం అవగాహన ర్యాలీని నిర్వభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనలు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నవీపేట్ : అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌వైజర్‌లు కిషన్, వెంకటేశ్వర్ రావు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ మంత్రిని కలిసిన ఎత్తొండ మాజీ విండో అధ్యక్షుడు

కోటగిరి,జూన్19: నిజామాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన ఈదురు గాలులు, అకాల వర్షానికి పెద్దఎత్తున ట్రాన్స్‌ఫార్మర్లు నేల కూలి రైతులకు విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నాయని ఎత్తొండ విండో మాజీ అధ్యక్షులు సోమశేఖర్‌రావు పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి సమస్యను వివరించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో సుమారు వంద ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో వాటి మరమ్మతులకు జాప్యం జరుగుతుందని వివరించినట్లు ఆయన తెలిపారు. మరమ్మతుల జాప్యం కారణంగా రైతులు పంటలు సాగు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రికి వివరించగానే వరంగల్ విద్యుత్‌శాఖ అధికారులకు తక్షణమే మంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. వంద ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన రైతులకు అందించాలని ఆదేశించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎత్తొండలో ఇంటింటి సర్వే

కోటగిరి,జూన్19: మండలంలోని ఎత్తొండ గ్రామంలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం లార్వ సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జ్వరంపై అనుమానం ఉన్న వారికి బీఎస్ కలెక్షన్‌తో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలు కాలనీలు పరిశీలించి ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న నీటి ట్యాంకులను ఖాళీ చేయించారు. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి గోవర్ధన్, హెల్త్‌సూపర్‌వైజర్‌లు జ్యోతి, సాయికుమారి, ఏఎన్‌ఎంలు సరోజ, రోజా తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

సుభాష్‌నగర్, జూన్ 19: నిజామాబాద్‌లోని న్యాక్‌కేంద్రం ద్వారా ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త కలెక్టరేట్ పక్కనే ఉన్న ఈ కార్యాలయంలో ల్యాండ్ సర్వేయర్, ఫ్లంబర్ జనరల్, సూపర్‌వైజర్ స్ట్రక్చర్ కోర్సుల్లో మూడునెలల పాటు హాస్టల్‌తో కూడిన ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, 4 ఫొటోలు, ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్లు, క్యాస్ట్ సర్టిఫికెట్ జతచేసి దరఖాస్తు చేయాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు కార్యాలయంలో ఇత ర వివరాలకు సంప్రదించాలని కోరారు. ల్యాండ్ సర్వేయర్‌కు, సూపర్‌వైజర్ స్ట్రక్చర్‌కు ఇంటర్మీడియెట్ పాసైన వారు అర్హులని తెలిపారు. ఫ్లంబర్‌కు 7వ తరగతి పాసై ఉండాలని తెలిపారు.

బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శిగా రామస్వామి

సిరికొండ, జూన్ 19 : బీజేపీ అనుబంధ సంస్థ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శిగా సిరికొండ మండలం గడ్కోల్ గ్రామానికి చెందిన రామస్వామిని నియామిస్తూ బీజేపీ ఎంపీ అరవింద్ ప్రకటించారు. నిజామాబాద్ జిల్లా ఓబీసీ కార్యదర్శిగా గత ఆరేళ్లుగా పనిచేస్తున్న రామస్వామిని రాష్ట్ర ఓబీసీ కార్యదర్శిగా నియమించారు. దీంతో మండలానికి చెందిన బీజేపీ నాయకులు రామస్వామిని అభినందించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో రాష్ట్ర ఓబీసీ కార్యదర్శిగా నియామకం చేసినందున ఎంపీ అరవింద్‌కు, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారికి అభినందనాలు చెప్పారు. పార్టీ అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తానని ఆయన చెప్పారు.

డీవీకే స్తూప కరపత్రాల ఆవిష్కరణ

సిరికొండ జూన్ 19 : నిజామాబాద్ పట్టణంలో నిర్మించిన సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి దివంగత డీ.వీ.కృష్ణారెడ్డి స్థూపాన్ని ఈ నెల 26న ఆవిష్కరిస్తున్న సందర్భంగా బుధవారం గడ్కోల్ గ్రామంలో కరపత్రాలను సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ ఆచరణాత్మక ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త భారత విప్లవోద్యమ నేత డీ.వీ.కృష్ణారెడ్డి విప్లవకారులందరికీ ఆదర్శ ప్రాయుడిని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, దామోదర్, లింబాద్రి, ఈ.రమేష్, కిషోర్, అనీస్, రాములు, ప్రభాకర్, నర్సయ్య తదితరులుపాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనంలో రాజీ పడవద్దు'

ధర్పల్లి, జూన్ 19: విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనంలో రాజీ పడవద్దని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో మధ్యాహ్నభోజనాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్నభోజన ఏజెన్సీలను ఉద్దేశించి మాట్లాడుతూ మెనూప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. ఉపాధ్యాయులు సైతం మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి ఏజెన్సీలకు వెంట వెంటనే ఆదేశాలు ఇవ్వాలన్నారు.

రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలి

ధర్పల్లి, జూన్ 19: మిషన్ భగీరథ కుళాయిల సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీవో బాలకృష్ణ కార్యదర్శులకు ఆదేశించారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో చేస్తున్న సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేసి తుది నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే సమాచారాన్ని ఖచ్చితంగా సేకరించాలన్నారు. భగీరథ నీరు వచ్చేది రానిది పొందుపర్చాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఆయా గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

మోర్తాడ్, జూన్19: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 2024-25 విద్య సంవత్సరానికి బుధవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలోని 42మంది విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన ఏకరూప దుస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు సరోజ దేవి, నీరజ, పాఠశాల వీవో పద్మ, రుచిత, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో గదుల నిర్మాణ స్థల పరిశీలన

వేల్పూర్, జూన్19: వేల్పూర్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల రెండు అదనపు గదుల నిర్మాణం కోసం స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ రాకేశ్వర్‌రావు గదుల నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసి కొలతలు తీసుకున్నారు. పీఎం శ్రీ పథకం కింద రెండు గదుల నిర్మాణానికి రూ.27లక్షలు మంజూర య్యాయన్నారు. ఈ గదుల నిర్మాణం మూడు నెలల్లోనే పూర్తి చేయాలని, అందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సక్సెస్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రాజన్న, కాంగ్రెస్ నాయకులు దామోదర్‌గౌడ్, రమణ, గంగారాం, మల్లేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన డీఐఈవో

బోధన్‌రూరల్,జూన్19: బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవికుమార్ సందర్శించారు. కళాశాల అధ్యాపక బృందంతో సమావేశమై కళాశాల అడ్మిషన్లు, అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. వీలైనంత వరకు అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. అధ్యాపకులు తప్పకుండా సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిఖత్ కౌసర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని వినతి

కోటగిరి,జూన్19: పొతంగల్ మండలంలోని కొడిచర్ల, పొతంగల్ మంజీర నదిలో ఇసుక అక్రమాలకు పాల్పడుతున్న మహరాష్ట్ర మాఫియాపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లయ్యకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు తమ పంట పొలాలకు నీళ్లు పెట్టేందుకు వెళ్తే మహరాష్ట్రకు చెందిన కొందరు ఇసుక మాఫియా నిర్వాహకులు ట్రాక్టర్లు, బోలేరలలో, టిప్పర్‌లలో ఇసుకను తరలిస్తున్నారని వారు తెలిపారు. పొలాలకు వెళ్లిన తమపై అకారణంగా దాడి చేశారని వారు తెలిపారు. ఇసుక మాఫియా అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమపై దాడి చేసిన వ్యక్తులపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పండరి, గంగారాం, నాగయ్య, లింగరాం, ఇబ్రహీం, రాజు, తదితరులున్నారు.

24న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలి

పెద్దబజార్, జూన్ 19: ఆశావర్కర్ల సమస్యలపైన ఈనెల 24న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. బుధవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతనంగా ప్రవేశపెట్టిన పరీక్ష విధానం రద్దు చేయాలన్నారు. బీసీజీ సర్వే పేరుతో కొత్త సంస్కరణ తీసుకురావడం జరుగుతుందని అన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఖిల్లా, జూన్ 19: నగరంలోని నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల వినాయక్‌నగర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. అనుమానాస్పదంగా మహిళలు ఉండడంతో విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడిలో ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి ఉన్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి మృతి

ఇందాల్వాయి, జూన్ 19: ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని త్రియంబక్‌పేట్ గ్రామంలో బైరి గణేష్ (22) అనే యువకుడు ఉరివేసుకొని మృతిచెందినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. గణేష్ ఇటీవలే ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లివచ్చాడని, అక్కడ అనారోగ్యం పాలుకావడంతో వెంటనే దేశానికి తిరిగివచ్చాడని అన్నారు. అప్పటి నుంచి ఆరోగ్యం సహకరించక మనస్థాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తల్లిదండ్రులు తమ సొంత పనుల నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఉరివేసుకొని మృతిచెంది ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

మహంతంలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

నవీపేట,జూన్19: మండలంలోని మహంతంలో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడి సట్ల సాయికుమార్(24)అనే ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందారని గ్రామస్థులు తెలిపారు. పొలంలో దమ్ము చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడిందని దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు వివరించారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

మందర్నాలో వృద్ధురాలు అదృశ్యం

బోధన్‌రూరల్,జూన్19: సాలూర మండలంలోని మందర్నా గ్రామానికి చెందిన పార్వతి బాయి(67)అనే మహిళ బుధవారం సాయంత్రం అదృశ్యమైనట్లు ఆమె కుమారుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మంగళవారం కుటుంబ సభ్యుల వద్ద, సంబంధీకుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీల ద్వారా అన్న కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

'విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి'

రుద్రూరు, జూన్ 19 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం విద్యార్థినులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలను ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుజాత నాగేం దర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకో వాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నారోజి గంగారాం, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో శాంతకుమారి, పాఠశాల ప్రత్యేక అధి కారిణి శ్యామల, ఉపాధ్యాయులు కృష్ణవేణి, సంతోషలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మానాల

ఏర్గట్ల, జూన్ 19: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాలమోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అందులో భాగంగా తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన బోధాసు గంగాధర్ ఇటీవలే తాటి చెట్టు పైనుండి పడి మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేయగా, చిట్యాల సాయమ్మ కుటుంబాన్ని అలాగే నాగేంద్రనగర్ గ్రామానికి చెందిన ఎస్‌కే జలీల్ కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటామని తెలి పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, ఆడెపు గంగాప్రసాద్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసి గడ్డం లింగారెడ్డి, బెజ్జాపురం భాను ప్రసాద్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని వినతి

భీమ్‌గల్ రూరల్, జూన్19: మండలంలోని బెజ్జోర గ్రామ శివారులో గల కప్పలవాగు నుంచి కొన్ని రోజులుగా అధికార పార్టీకి చెందిన కొందరు ఇసుకమాఫియా అవతారం ఎత్తి రాత్రిళ్లు యథేచ్ఛగా ఇసుకను టిప్పర్‌ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని బుధవారం మండల బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీపీ ఆర్మూర్ మహేష్ ఆధ్వర్యంలో ఆర్మూర్ ఏసీపీకి వినతిపత్రం అందజేశారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు భయపడి వారు ఇచ్చే మామూళ్లను అందుకుంటూ ఇసుక అక్రమ రవాణాను యథేచ్ఛగా ప్రోత్సహిస్తున్నారని జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దొన్కంటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

డిచ్‌పల్లి,జూన్ 19:డిచ్‌పల్లి-నిజామాబాద్ ప్రధాన రోడ్డు గుంతల మయంగా మారిందని, మరమ్మతులు చేసి గుంతలు పూడ్చి వేయాలని, డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట భారీ గుంతతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్‌డిమాండ్ చేశారు. గత మూడు రోజుల్లో 4 ప్రమాదాలు ఈ గుంతలతో జరిగాయాని పేర్కొన్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయాలని కోరారు.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బోర్డును రద్దు చేయాలి

- నగరంలో విద్యార్థుల భారీ ర్యాలీ

నిజామాబాద్ అర్బన్, జూన్ 19: విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యు, ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో విద్యార్థులు భారీర్యాలీ నిర్వహించారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నీట్ విద్యార్థులతో భారీర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కౌన్సిల్ మెంబర్ బానోత్ రఘురాం, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదీనంలో నడుస్తున్న ఎన్‌టీఏ బోర్డును వెంటనే రద్దు చేసి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి 24 లక్షల నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ విషయంలో స్పందించాలన్నారు. కేంద్రం రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని కాపాడి నీట్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వంచే నిర్వహించాలని అదేవిధంగా నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలన్నారు. తప్పు చేసిన కోచింగ్ సెంటర్లపై శాశ్వతంగా నిషేధం విధించి పేపర్ లీకేజీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్, వేణురాజ్, అంజలి, గణేష్, గౌతమ్, రాజేశ్వర్, అనిల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

సుభాష్‌నగర్, జూన్ 19: ఆర్టీసీ కండక్టర్ తన నిజాయితీని చాటుకున్నాడు. వరంగల్ నుంచి కోరుట్ల వెళ్తున్న బస్సులో మరిచిపోయిన పర్సును ప్రయాణికురాలికి అందజేశారు. బుధవారం వరంగల్ నుంచి కోరుట్ల వెళ్తుండగా ఓమహిళ తన పర్సును మరిచిపోయింది. పర్సులో రూ.3,600 ఉండగా పర్సుని నిజామాబాద్ డిపోమేనేజర్ సాయన్న చేతులమీదుగా అందజేశారు. కండక్టర్ రామరాజును అభినందించారు.

'కార్మికుల బకాయిల వేతనాలు చెల్లించాలి'

పెద్దబజార్, జూన్ 19: లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల బకాయిల వేతనాలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుత్ప, అలిసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో గత అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించడానికి అంగీకరించి, మూడు నాలుగు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తున్నారని అన్నారు. పీఎఫ్, ఈఎస్సై లాంటి మౌలిక సదుపాయాలను అమలు పర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గణేష్, కార్తిక్, అజయ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72700	రూ.67,000	రూ.920

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : హరోం హర (10.45, 7.25, 10.40)
: ఇన్‌సైడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (2.00)
: మహారాజ (4.20)

స్క్రీన్-2 : ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (11.25, 5.00)
: మనమే (1.45, 7.20, 10.35)

స్క్రీన్-3 : మహారాజ (10.45, 10.40)
: మ్యూజిక్ షాప్ మూర్తి (1.50)
: హరోం హర (4.40)
: నీదారే నీకథ (7.55)

స్క్రీన్-4 : చందు ఛాంపియన్ (హిందీ) (10.15, 1.25, 7.20, 10.30)
: ముంజియా (హిందీ) (4.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.50, 1.45, 4.40, 7.35, 10.30)

స్క్రీన్-2 : మహారాజ (1.45, 4.45, 7.45)
: హరోం హర (10.30)

స్క్రీన్-3 : మహారాజ (10.40)
: హరోం హర (1.40, 7.35)
: నీదారే నీకథ (4.45)

దేవి : మహారాజ (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : చందు చాంపియన్ (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : హరోంహర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్